శ్రీ గణేశాయ నమః   శ్రీ సరస్వత్యై నమః   శ్రీ గురుభ్యో నమః

# శ్రీ దత్త సూక్తులు



దత్త భక్తులు :


**డా॥ జొన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి**
M.Sc., Ph.D.


సమర్పితము :

**చిలకూరు బాలకృష్ణమూర్తి**
భవాని దంపతులు

కృష్ణలంక : : విజయవాడ - 13.



డా॥ వేణుగోపాలకృష్ణమూర్తి గారు



చిలుకూరు బాలకృష్ణమూర్తి, భవాని

శ్రీ గురుదేవదత్త

# శ్రీ దత్త సూక్తులు

## (అక్షర ప్రసాదము)

భగవాన్ శ్రీ దత్తాత్రేయ స్వామివారు శ్రీదత్త భక్తులు శ్రీజొన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తిగారికి సాక్షాత్కరించి కర్ణపేయముగా వినిపించిన శ్రీ దత్త వాణి భక్త మహాశయులకు సులభ సాధ్యముగా అందచేసి తరించుటకు శ్రీ గురు దత్తానుగ్రహ ఆదేశానుసారము ప్రకటితము.

విశ్వసించిన అంతా కలదు - అనుమానించిన ఏమీలేదు
నమ్మి చెడినవాడూ లేడు - నమ్మక చెడని వాడూ లేడు
విశ్వసించిన నేనే వస్తా - అనుమానించిన నీవే రావు
నాకు లాభము ఏముందీ - అంతా లాభము నీకేగదా?

జీవన్ముక్తికి సులభోపాయము

— o —

## దత్త భక్తులు


Dr. జొన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి Msc. Ph.D.
(ప్రొఫెసరు, కెమిస్ట్రీ). రామరెడ్డిపేట, నరసరావుపేట.


## సమర్పితము

**చిలుకూరు బాలకృష్ణమూర్తి, భవాని దంపతులు**

41-15-4 నల్లగేటు డౌన్, కృష్ణలంక, విజయవాడ-13.

# శ్రీ దత్త సూక్తులు

## పాఠకులకు మనవి

శ్రీ దత్త భగవానుని కృపా కటాక్షముచేత, దత్త భక్తులు శ్రీ జొన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తిగారితో పరిచయ భాగ్యము, వారి సహచర్యము, వారి అనుగ్రహ భాషణము, వారి ఆశీస్సులు మా దంపతులకే కాక, మా కుటుంబ సభ్యులందరికి లభించటం మా పురాకృత పుణ్య విశేషమే కాని వేరొకటి కాదు. వీరికి శ్రీ దత్తాత్రేయ స్వామివారు సాక్షాత్కరించి ఎన్నో ఆధ్యాత్మిక విషయములు వివరించారు. వీరు సంస్కృత విద్యలో మేధావులు. 60 కి పైగా గ్రంథాలు రాశారు. జ్యోతిష్యంలో అందెవేసిన చెయ్యి. శ్రీదత్త స్వామివారు సాక్షాత్కరిస్తారు. వారితో ప్రసంగిస్తారు. సర్వకాల సర్వావస్థలయందు ప్రసన్నులే. వారి సాన్నిధ్యములో మేము ఎన్నో అనుభూతులు పొందినాము. ధన్యులము. శ్రీ గురుని ఆదేశమును శిరసా వహించి, శ్రీదత్త భక్తుల పర్యవేక్షణలో వారి సూచనల మేరకు శ్రీదత్త వేదము అను పవిత్ర గ్రంథ రాజమును ది 12-7-1995 గురు పూర్ణిమనాడు భక్త మహాశయులకు అందించి కృతార్థులమైతిమి. ఇప్పుడు శ్రీ గురువాజ్ఞానుసారము శ్రీవారి సూక్తులను "శ్రీదత్త సూక్తులు" అను గ్రంథ రూపమున అందించుచున్నాము.

భక్త మహాశయులు పఠించి తరింతురు గాక యని వినతి.

విజయవాడ
ధాతృనామ సం॥
ఆశ్వయుజ
విజయదశమి
21-10-1996

ఇట్లు
చిలుకూరు బాలకృష్ణమూర్తి
భవాని
దంపతులు

# శ్రీ దత్త సూక్తులు

## శ్రీ దత్తో వాచ

1 వాక్కు, మనస్సు, క్రియ- ఈ త్రికరణములను జాగ్రత్తగా వాడుకొనవలెను. అనవసరంగా మాట్లాడుట, ఆలోచించుట, పనులు చేయుట వలన శక్తి వృథా పోవును. కనుక శక్తి దుర్వినియోగం చేయకుము. భక్తి స్థాయిని పెంచుకొనుము. తరింతువు.

2 ఆరాధనలో కోరిక యుండరాదు. ఆరాధన కోరికల కోసం కాకుండా స్వామికోసమే చేయాలి. ఇదే నిష్కామ ఆరాధన అంటే.

3 భగవంతుని చేరుటకు భక్తియే ఏకైక మార్గము. భక్తి యొక్కటే స్వామిలో కరుణను, ప్రేమను కలుగచేయగలదు.

4 శరీరము - మనస్సు - ఈ రెండిటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి సాధన బాగా జరగాలంటే.

5 సాత్వికాహారము, రాజయోగము - శరీరమునకు, మనస్సుకు మంచి ఆరోగ్యాన్నిస్తాయి.

6 గురు శబ్దము కేవలము నాయందే సార్థకము.

7 నేను స్మరణమాత్ర సంతుష్టుడను. నా వరాలు అనంతాలు, అమోఘాలు. నాకు పెట్టిన ఒక నమస్కారము 33 కోట్ల నమస్కారము అగును.

8 నేను భోగమోక్షప్రదుడను. భోగములనిచ్చి తృప్తినొందించి జీవులకు అవల ముక్తినొసంగుచున్నాను.

9 నన్ను ఆరాధించుటకు నా పాదుకలు చాలును.

10 - ధర్మమునకు మూలమైనది దైవమే కదా!

11 మనము తిను ఆహారము శుచిగా, సాత్త్వికముగా, శక్తివంతముగా, మితముగా యుండవలెను.

12 త్రిమూర్తులను మించినవాడు లేడు. త్రిమూర్త్యాత్మకుడనైన నన్ను మించినవాడు లేడు.

13 అందరిలోను నన్నే చూడుము. అంతర్యామిగా సర్వసృష్టిలో వ్యాపించి నేనే వున్నాను.

14 శ్రీశైలంలోని భ్రమరాంబ నా మూలకారణ శక్తి. మల్లిఖార్జున స్వామియే నా త్రిముఖషడ్భుజ రూపము. నే నొక్కడినే వివిధ నామ రూపాలలో భోగ మోక్షప్రదుడను.

15 గురువు నాశ్రయించి నమ్మినచో భగవంతుని చేరినట్లే.

16 నీవు సంసార సముద్రమున మునిగి తడిసి యున్నావు. ముందు వైరాగ్యము వచ్చినగాని ఎండినట్లు కాదు. నా భక్తియే నీకు వైరాగ్యము నిచ్చును. భక్తిలేని వైరాగ్యము నిష్ఫలము అసాధ్యము కూడా.

17 నీ దారా పుత్రాదుల బంధములు క్షణికములు. కనుక నిన్ను నీవే ఉద్ధరించుకొనవలెను.

18 ఏకాంతములో అంతర్ముఖముగా సాధన చేయుము. సాధనలో కోరిక యుండరాదు. కనుక కోరికలను త్రుంచివేయుము. నీ భక్తి ఫలించును.

19 నా స్మరణము సదా వుండినచో నీకు కైవల్యము సిద్ధించును.

20 సాక్షాత్కారము గొప్ప విషయము కాదు. కావలసినది స్వామి యొక్క అనుగ్రహము.

21 భగవంతునకు భాషకాదు కావలసినది భావము. భావమెచ్చట యున్నదో అచ్చట స్వామియుండును.

22 ఏ కోరికయు లేక చేయు ఆరాధనారూప ప్రయత్నము ద్వారా భగవత్కైవల్యమును పొందుటయే నిష్కామ కర్మయోగ రహస్యము.

23 ఒక దత్తుడే అన్ని దేవతల రూపాలు వేషాలుగా ధరించి, అందరికి తృప్తినిచ్చు చున్నాడని మరువకుము.

24 యమము అనగా బాహ్యేంద్రియ నిగ్రహము. నియమము అనగా అంతరేంద్రియ నిగ్రహము. సంసార విషయములకు శక్తి వృధాగా ఖర్చుకాకుండా లోపలకు ఇంద్రియ వృత్తులను ఉపసంహరించుకొని శక్తిని దైవారాధనకై దాచుకొనుటయే ప్రత్యాహారము. ఇక ఆసనము అనగా శరీరమునకు ఆరోగ్యమిచ్చి కుదురుగా కూర్చునునట్లు చేయుటయే. ప్రాణాయామము మనస్సునకు నిశ్చలత్వము బలము నిచ్చును. ఇట్లు శక్తి నిధిని కూర్చుకొని నిరంతరము చేయు దైవా రాధనయే ధారణ. భగవత్కృపచే నిరంతర భగవచ్చింతన ఏర్పడుటయే ధ్యానము. దాని ఫలితములే సామీప్య, సారూప్య, సాలోక్య, సాయుజ్యములు. ఈ నాలుగును సవికల్ప సమాధి లక్షణములు. ఇక నిర్వికల్ప సమాధిలో కైవల్య మేర్పడి జీవన్ముక్తు డగును.

25 సత్వగుణమే స్వామితో సంబంధము పెట్టుకొనగలదు. జీవుడు సృష్టిలోని భాగమే తప్ప, సృష్టి కర్త కాడు. వాత సూర్యాదులను శాశించు పరమాత్మ ఎక్కడ? పెనుగాలికి నిలువలేక పడిపోవు జీవుడెక్కడ? సూక్ష్మ విచారణచేత అర్థమగువాడు జీవుడు. ఎంత విచారించినా అర్థం కానివాడు పరమాత్మ.

26 అహంకార, మమకారములు త్యజించుము. శరణాగతి చేయుము. తరింతువు.

27 శివ శక్తి ఏకరూపమే శ్రీదత్తుడు. నన్ను తెలియలేమని తెలుసుకున్న వాడే నన్ను గురించి తెలిసినవాడు. నన్ను తెలుసుకొంటి నన్నవాడు ఏమియు తెలియనివాడు.

28 నాచే ఫలము ఇప్పింపగలది కేవలము ప్రేమ రూపమైన భక్తియే.

29 విషయ సంగమును పరిత్యజించుము. దానిచే వైరాగ్యము సిద్ధించును. విషయములకు దూరమై తర్వాత సత్సంగములో యుండవలెను. ఆ తర్వాత పురుష ప్రయత్నము సమగ్రమై ప్రపత్తి చేయవలెను. అనగా స్వామి కరుణకై ప్రపన్నుడవై యాచించవలెను. నీ దయ వచ్చిన ఇమ్మని అడుగవలెను. అప్పుడు భక్తిని నేనిత్తును. అట్టి భక్తి నిష్కామము కావలెను. అదియే పరాభక్తి. అప్పుడు నేను కైవల్యము నిత్తును.

30 నిష్కామం వలన అంతర్ముఖత్వం వస్తుంది. నిరంతర ఆరాధన చాలా ముఖ్యము. నిష్కామము, యోగము, అంతర్ముఖత్వము ఇవియే కైవల్యానికి మార్గము.

31 సాధక జీవుడు దేహములోని అంతరాత్మయేగాని జగత్తుయొక్క అంతర్యామి కాదు.

32 బ్రహ్మచర్యము ద్వారా శక్తిని దాచి ఆ శక్తిని భగవంతునికి అదే ఆకర్షణ రూపములో సమర్పించుటయే రాసక్రీడ.

33 మనస్సును కేంద్రీకరించి, కర్తవ్యములను ఆచరించుచు విశ్రాంతి తీసుకొనుచు, మిగిలిన సమయమునంతా విషయములకు దూరముగా యుండి, వాటి ప్రభావములను తప్పించుకొనుచు నా ఆరాధనలో నిమగ్నము అగుటయే గృహస్థాశ్రమము నందు చేయవలసిన ధర్మము.

34 దేవతారూపము లన్నియు నాలోని భాగములే.

35 మరణమునకును, ముక్తికిని సంబంధము లేదు. బ్రతికి యున్నప్పుడు ఏది సాధించినావో, మరణానంతరమును అదే పొందగలవు. కాన బ్రతికి యున్నప్పుడు కాకున్నచో మరణానంతరము కాదు.

36 బ్రహ్మమే ఈశ్వరుడు. ఈశ్వరుడే బ్రహ్మము. మేల్కొని కల గాంచువాడు ఈశ్వరుడు. కలలలో బద్ధుడై దృశ్యరూపుడై కలలను చూచువాడు జీవుడు.

37 సాధన ద్వారా జీవించి యుండగనే ముక్తిని, సిద్ధిని పొందవలెను.

38 జీవన్ముక్తియే నిజమైన ముక్తి. మరణానంతరము ఫలానుభవమే తప్ప సాధన చేయ వీలుకాదు.

39 విశ్వరూప ప్రదర్శనమే పూర్ణసిద్ధి. కాన నేను పూర్ణసిద్ధుడను. కాన నాకు సాధన అవసరములేదు. విశ్వము యొక్క సృష్టి స్థితిలయముల ప్రదర్శనమే నా పూర్ణసిద్ధి.

40 సంసారా సక్తులైన జీవులను విడిచి, దైవాసక్తులైన భక్తులయందు సాంగత్యమును పెంచుకొనవలెను. అపుడా సాధక జీవుడు కైవల్యము పొందును.

41 నన్ను స్తుతించుటలో ఒకే విధమైన వాక్కురూపము కన్నా, నాలుగు విధములుగా స్తుతించుట నాకు ఇష్టము, ప్రీతికరము.

42 సహస్ర రుద్రాభిషేకముకన్నా, నాలుగు రకముల వాక్కులతో అనగా పద్యము, వచనము, గీతము, నామ జపములతో శివుని ఆరాధించుము. అది నాకు ప్రీతికరము.

43 కోరికలను త్రుంచుము. ఐహికములను, అష్ట సిద్ధులను, చివరకు మోక్షమునుకూడా కోరకుము.

44 గుణము ద్రవ్యమును ఆశ్రయించి యున్నట్లుగా, సృష్టినాశ్రయించి యున్నది. నిర్గుణుడను అనగా గుణాతీతుడనని అర్థము.

45 నేను అన్యాశ్రయుడనుగాదు. స్వాశ్రయుడను. కాన నేను సృష్టిని కాను. సృష్టి కర్తను. కనుక నేను గుణమును గాను. నిర్గుణుడను. అయితే భక్తుల ధ్యాన సౌకర్యమునకుగాను నేను గుణముగా మారుతాను.

46 నేను గుణము, నిర్గుణము రెండూ ఒకే సమయంలో ఉండగలను. అది నా సర్వశక్తికి సాధ్యము.

47 సదా నా ఆరాధనలో యుండుము. ఆరాధనా విధానములను మార్చవచ్చునుగాని, ఆరాధనా రహితముగా యుండరాదు.

48 జ్ఞానము, కర్మ, యోగము, భక్తి- చాలా అవసరము.

49 మడి అనగా సత్సంగము మైల యనగా దుస్సంగము. కీర్తి, మోక్ష సాధనముగాదు. దుస్సంగమును పరిహరించుము. సత్సంగములో కాలము గడుపుము.

50 ఆరాధనలో నిష్కామము చాలా ప్రధానము. నిష్కామారాధనకు నేను అనంత ఫలమును నీకు ఇచ్చుచున్నాను. ఉ॥ కుచేలుడు, ప్రహ్లాదుడు, తిన్నడు.

51 ఇప్పుడు ఉన్న నరజన్మ మరల వచ్చునను నమ్మకములేదు. ఇప్పుడు ఉన్న అవకాశమును వృధాగా పోనీయకుము. నన్ను ఆ ముష్క్మకమునే అర్థించుము.

52 భగవత్ప్రీతియే తన ఆనందముగా భావించుటయే భక్తి. ఇట్టి భక్తిలో స్వార్థముండదు. లోకములోని ప్రేమ లన్నియు స్వార్థములే. అవి అసత్యములు, అనిత్యములు అని తెలుసు కొనుము.

53 నన్ను ఆరాధించుటకు సమయము, విధానము ప్రధానము కావు. భావమే ప్రధానము. భావరహితమైన కేవల నిర్దిష్ట సంఖ్యా సమయము గాని, ప్రతి దినము నిర్దిష్టమైన ఒకే యాంత్రిక పూజా విధానముకాని నన్ను ఆకర్షించ జాలవు.

54 కోరికలు కలవాడు కార్త వీర్యార్జుని వలె పతన మగును. కాన కోరికలను పూర్తిగా త్యజించి నన్ను అర్చించవలెను.

55 భక్తి ప్రధానము గాని, ఎన్నుకున్న దేవతా రూపము కాదు. ఎందువలన ననగా అన్ని దేవతా రూపములు నా వేషములే గదా.

56 సత్సంగము వలన ఆధ్యాత్మికాభివృద్ధి కలిగి విషయాసక్తుడు కాక అవధూత లక్షణములు కలిగి భగవంతునకు చేరువ అగుచున్నావు అదే లౌకిక జ్ఞానము పెరిగిపోయి విషయాసక్తత అభివృద్ధి పొందినచో అవధూత లక్షణములకు దూరమై చెడిపోవుదువు. కనుక సత్సంగములో కాలము గడుపుము. లౌకిక ప్రసంగములకు దూరముగా యుండుము.

57 నిజమైన భక్తుడు భగవంతుని ఏకాంతంలో రహస్యంగా అంతర్ముఖుడై ఆరాధిస్తాడు. ఏకాంత సేవ, అంతర్ముఖత్వము యొక్క అంతరార్థము ఇదే.

58 సంసార భావోద్రేకములను నివారించుము. ఉదాసీనత, నిర్లిప్తత అలవరచుకొనుము.

59 త్రిమూర్త్యాత్మకుడయిన సద్గురువు సర్వ సమర్థుడు. ఆయనకు సాధ్యాసాధ్యములంటూ ఉండవు. ఆయన వాక్కు పరమేశ్వర శాసనమే.

60 ముక్తియనగా ఈ సంసార బంధములనుండి విడివడి నా సేవకుడై నా కార్యక్రమమున పాల్గొనుటయే. ముక్తి యనగా నాది అను భావమును పోగొట్టుకొనుటయే ఆ "నాది" పోయినచో "నేను"

పోవును. అప్పుడు అనాది సిద్ధించును. అట్టివానిలో నేను పూర్ణముగా లీనమై ఉందును. ఇదియే జీవన్ముక్తి. ఇట్లు నా కార్యమున పాల్గొనుటయే నీకు నిజమైన సేవయగును.

61 నా దర్శనము మెప్పుడును జ్ఞానబోధకమే, గురుస్వరూపమే అని గుర్తించుము.

62 ఐహికములు నీ వెంటరావు. అంత్యకాలములో నిన్ను కాపాడలేవు. ఇవి క్షణికములు. కనుక నేను కావలయునా? ఈ ఐహికములు కావలయునా? అనే ఈ ఒక్క ప్రశ్నయే దత్త పరీక్ష.

63 ఐహికములు ఈ జన్మ కాగానే నిన్ను నిర్దయగా విడిచిపోవును. కాని నన్ను కోరుకొన్నచో జన్మ జన్మలలో నిన్ను విడువక నీ వెంట పడుచుందును. కనుక విరక్తి కలిగి యుండుము. నన్నే సదా స్మరించి, నా యందే నీ దృష్టిని ప్రతిక్షణమును నిలుపుము. ఏ జీవునైనా, ఏనాటికైనా ఉద్ధరించవలసిన, ఉద్ధరించగలవాడను నేనే, నేనే, నే నొక్కడనే.

64 నేను మాయా హరుడనే తప్ప కేవలము మాయావర్ధనుడను కాను.

65 ఏ విషయమును మనస్సుచేత చింతించుట మానవలయును. సంతోషమును, దుఃఖమును త్యజించవలెను.

66 నీ శక్తిని, కాలాన్ని నాకై వినియోగించుము. నీ వాక్కును బుద్ధిని నాకై ఉపయోగించుము. నీ ద్రవ్యమును, నీ జ్ఞానమును నాకై వ్యయించుము.

67 మితముగా సత్వాహారమును భుజించుము. విహారములను తగ్గించుము. తృప్తితో యుండుము. నా వాక్కును మాత్రమే ప్రచారము చేయుము.

68 నాయందే తీవ్రకామము కలవాడు జ్ఞాని. సంసారకామమే అజ్ఞానము. అద్వైత సిద్ధియే జీవన్ముక్తి.

69 భక్తిప్రపత్తులు గలవాడు నాకు చాలా ఇష్టుడు. కాన భక్తిప్రపత్తులు గలవానికి సిద్ధిని ఇచ్చుచున్నాను.

70 సంసారమునందు శక్తి దుర్వినియోగము గాకుండా దాచుటయే యోగము. ఇది లేనిదే మహాభావము రాదు.

71 నీవు నాలో లీనమైనచో నీవు శూన్యమగుదువు. అది నీకు నష్టము. నేను నీలో లీనమైనచో అదే జీవన్ముక్తి. ప్రతిఫలాపేక్ష లేకుండా యున్న ప్రేమయే శుద్ధ భక్తి. దానినే సంపాదించుకొనుము. తరింతువు.

72 అద్వైత సిద్ధి లభించినగాని అహంకారరాహిత్యము ఏర్పడదు. మాత్సర్యము యొక్క ఫలమే అహంకారము.

73 చిక్కడు—చిక్కితే విడువడు. ఇదియే శ్రీ దత్తతత్వము. నా వాత్సల్యము ముందు మాతృ, పితృ,గురు వాత్సల్యములు ఎందుకు పనికి రావు. అందువలన శ్రీ దత్తుని చిక్కించుకున్నవాడు ధన్యుడు. తరించక తప్పదు.

74 వినయమును మించిన సాధన, గుణము లేదు. సదా సత్సంగమే నిత్య జ్ఞానము. నిత్యజ్ఞానమే అజ్ఞానమును పూర్తిగా తుడిచి వేయగలదు.

75 సత్సంగమును ఆపినచో వెంటనే దుస్సంగము నీ వెంటపడి లాగుకొనిపోవును.

76 ఆచరణలేని జ్ఞానము వ్యర్థము. అపార జ్ఞాన సముద్రమే గురువు. ఆ గురువును నేనే. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ. అట్టి అనంత జ్ఞానమే బ్రహ్మ కావున అట్టి సదా జ్ఞానముచే అజ్ఞానము

నివృత్తింపబడి ఆచరణ సిద్ధించి, నాయందు నీవు చేయు ప్రపత్తి భక్తిచే పూర్ణసిద్ధిని పొందగలవు.

77 పంచభూతములకు విలక్షణముగా యున్న నన్ను ఈ పంచభూతముల సృష్టియేనని భ్రమించరాదు.

78 పూర్ణ భక్తికి, సత్యభక్తికి లక్షణము పరిపూర్ణ వైరాగ్యమైన నిష్కామమే.

79 శాంతితో, ప్రేమతో యుండుము. ఆవేశముచేత శక్తి వ్యర్థమై కాలము కలుషితము అగును. శాంతిచేతనే యోగము సిద్ధించును. శాంతియే యోగము యొక్క ప్రధానమయిన మొదటి లక్షణము.

80 సాధనచే భగవంతుని సమీపించుట క్రియ. భగవంతునిలో ఐక్యమగుటయే యోగము. ఇదే క్రియాయోగము. క్రియ అనగా సృష్టి. క్రియకు అతీతుడైనవాడు నిష్క్రియుడు స్వామి ఒక్కడే. క్రియాయోగమే కర్మయోగము.

81 మనసా, వాచా, కర్మణా జీవుడు మధుమతియై ప్రేమ భావముతో ఉండుటయే మధుమతి. త్రిశక్తి స్వరూపిణి.

82 జీవులందరు ప్రకృతియేకాన స్త్రీ రూపులే అని గ్రహించి, భర్త యను అహంకారమును వదలి, భర్త స్వామియేయని గుర్తించిన నాడు స్వామి యదార్థ కళ్యాణముగాని, తలంబ్రాలు పోయించి స్వామి కళ్యాణముచేసితి ననుకొనువాడు అజ్ఞాని.

83 స్వల్పములైన ఐహికములకన్ననూ గొప్పది అయిన ఆముష్మికమును నేను ఇచ్చెదను. కాన నిజముగా ఐహిక ఆముష్మిక ప్రదాతను నేనే, నేనే, నే నొక్కడనే. తెలుసుకొనుము.

84 భగవంతుడు సర్వవ్యాపకుడు. సర్వమునకు ఆధారము. అన్ని చోట్ల అన్ని శక్తులు కలిగియున్నాడు. ఒక ప్రదేశమున కాని, ఒక

కాలమునకాని ఏ ప్రత్యేకత లేదు. కనుక భగవంతుని ప్రసన్నము చేసుకొనుట ముఖ్యముగాని, అన్ని ప్రదేశములు, అన్ని కాలములు సమానమే అని తెలియుము.

85 నీకు నాపై ప్రేమభావము కలిగినపుడు ఏ సమయమైనను, ఏ ప్రదేశము అయినను, ఆ సమయములో నీకు తోచిన మాటలతో చేష్టలతో ప్రేమను వ్యక్తము చేయుటయే నిజమయిన ఆరాధన.

86 ఒకనాడు నన్ను అర్చించలేకపోయితివి అనుకొనుము. ఒకనాడు నన్నర్చించనంతమాత్రాన చింతించనేల? నీ పిల్లలపై, నీ భార్యపై, నీ భర్తపై ఎట్లు సహజ ప్రేమ, దేశ కాల నియమములు లేక వ్యక్తములగునో, అట్లే నాపై దేశ కాల నియమములు లేకుండా వ్యక్తము చేయుటయే నిజమైన ఆరాధన. నీ సహజ సత్యప్రేమను నాకు సమర్పణము చేసిన చాలును. నీ హృదయములో యున్న నేను నీ శరీరమునంతను వ్యాపించి నీవే నేనగుదును.

87 ఎచట కోరికలు లేక, నిష్కామంగా, జనులు నా ఆరాధన చూడవలయును అను డాంబికము లేకుండా, ఏకాంత ప్రదేశమున భక్తుడు ఆరాధించుచున్నాడో, అచటయే స్వామి విశేషముగా వ్యక్తమగుచున్నాడు.

88 నిష్కామము, ఏకాంతము ఎచ్చట యున్నవో, అదియే నిజమైన పుణ్యక్షేత్రము అని ఘంటాపదముగా చెప్పుచున్నాను.

89 నిష్కాముడవు కమ్ము. కేవలం భగవత్కాముడవై ఏకాంత ప్రదేశమునకుపోయి నన్ను ఆరాధించుము. అందుకని ఇల్లు విడచి అరణ్యములకు పొమ్మని కాదు. నీ పూజా గృహమునందే ఏకాంతముగా నిష్కామముగా నన్నారాధించుము. అదియే నిజమైన పుణ్యక్షేత్రము, నిజమైన తీర్థయాత్ర.

90 పరబ్రహ్మమును తెలుసుకొను జ్ఞానార్జనయే శ్రేష్ఠము.

91 ఆధ్యాత్మిక సాధన, జీవిత విధానము- ఈ రెండు వేరు కానేకావు. ఈ జీవితమే సాధన.

92 మీ జీవితాలను స్వార్థరహితమైన, నిష్కామమైన ప్రేమతో నింపు కొనుడు. ఆ ప్రేమలో ద్వేషము, క్రోధము, అసూయ, అహంకారము అను విష బిందువులు పడకుండా కాపాడుకొనండి. అపుడే మానత్వము పరిపూర్ణమగును. పరిపూర్ణమైననాడు దైవత్వము క్షణములో సిద్ధిస్తుంది.

93 జీవితమును సత్వ గుణమయంగా చేసుకొండి. అది జరిగిననాడు మీ ఆధ్యాత్మిక సాధన ఒక్క క్షణమే. ఈ రహస్యము గ్రహించక మీరు ఎన్ని పూజలు చేసిననూ, ఎన్ని భజనలను చేసిననూ, ఎన్ని గ్రంథములను చదివిననూ అవి వ్యర్థములని నొక్కి నొక్కి వక్కాణించుచున్నాను.

94 సంభూతి ఉపాసన అనగా ద్రవ్యముతో ఉపాసించుటయే తప్ప మానసికముగా చేయకుండుట. అసంభూతి ఉపాసన అనగా మానసికంగా ఉపాసించుటయే. తప్ప ద్రవ్యముతో చేయకుండుట. ఈ రెండింటిని జోడించి చేసిన ఉపాసన సిద్ధించును.

95 శ్రీ దత్తుని కన్నా వేరు దైవములేడు. దైవ ప్రేమకన్నా వేరు సాధనము లేదు. ఈ జగత్తును సృష్టించి, పాలించి, లయము చేయువాడు ఒక్కడే. బ్రహ్మ విష్ణు ఈశ్వర నామములు క్రియా నామధేయాలే కాని మూర్తులు కావు. ఆ మూడు నామ దేయాలు నావియే. కాన దత్తుని మించిన దైవము లేడు.

96 గతమును చింతించకుము. భవిష్యత్తును ఊహించకుము. ఈ క్షణమే మీది.

97 ఇక నైననూ సమయాన్ని, శక్తిని, వృధా చేయకుము. సదా నా ఆరాధనలో యుండుము. తరింతువు.

98 అచ్చట ఆ లోకములో విన్నే జీవుడును, కనీసము గుర్తించను కూడా గుర్తించడు. మరువకుము. ఈ భార్యా, పుత్రులు, ఈ ఈ భోగభాగ్యములు, ఈ శరీరము, ఈ పదవులు అన్ని క్షణ భంగురములు. అసత్యములు, అనిత్యములు, మరువకుము. సత్యాన్వేషణ చేసుకొనుము. తరింతువు.

99 మరల చెప్పుచున్నాను. ఇది సత్యము. ఆరాధనలో కోరిక ఉండరాదు కోరిక విలువను పోగొట్టును. బిచ్చగాడు మీ ఇంటికి వచ్చి దీనాతిదీనంగా పిడికెడు మెతుకులు అడిగితే కసురుకుంటావు. అదే బంధువు (అతిథి) వచ్చి అన్నం అడుగక పోయినా భోజనానికి సాదరంగా పిలుస్తున్నారు. మేమిద్దరమూ బిచ్చగాళ్ళమే. కానీ వాడికి విలువ లేదు. అతిథికి ఎందుకు ఇంత విలువ నిచ్చావు? కారణం ఒక్కటే. అతిథి మీ ఇంటికి మీ అన్నం కోసం రాలేదు. కేవలం మీ కోసం వచ్చాడని మీకు తెలుసు. బిచ్చగాడు మీ కోసం రాలేదు. కేవలం మీ అన్నం కోసమే వచ్చాడనీ మీకు తెలుసు. కాన కోరికలు తీరటం కోసం మనం చేసే దైవారాధన మన ఆరాధనా విలువను పోగొట్టుచున్నది.

100 చివరి మాటగా చెప్పుచున్నాను. ఆరాధన కోరిక కోసం కాకుండా, నా కోసం చేయాలి. కోరికపై ధ్యాస ఉండరాదు. నీకు కావలసినది నేనే సాదరంగా ప్రేమతో తీరుస్తాను. కనుక నిస్స్వార్థంగా, నిష్కామంగా, ఏకాంతములో అంతర్ముఖుడవై సదా నన్నారాధించు. కైవల్యం సిద్ధిస్తుంది.

ఓం తత్ సత్

—★—

హరిః ఓం

# శ్రీ దత్త స్తుతి

వందేతి రమ్యం। విశ్వైక గమ్యం। ఉన్మత్తదత్తం। గురుదేవం॥
వేదాంతసారం। నానావతారం। భక్తోపకారం। భజదత్తం॥
సంసార పారం। రుద్రాక్ష హారం। నీహార గౌరం।భజదత్తం॥
కాషాయచేలం। పాత్రాక్షమాలం। అమ్నాయమూలం। భజదత్తం॥
జ్వాలాక్షిఫాలం। ఢక్కా త్రిశూలం। కంఠాహి నీలం। భజదత్తం॥
పాదాంత శక్రం। విచ్ఛిన్న నక్రం। శ్రీ శంఖ చక్రం। భజదత్తం॥
కందర్ప రూపం। సౌందర్య దీపం। యోగీంద్రభూపం। భజదత్తం॥
మంత్రాత్మ బీజం। తంత్రార్థ భాజం। శ్రీ యంత్ర రాజం। భజదత్తం॥
మంత్ర ప్రమాణం। మంత్రైక వేద్యం। మంత్ర స్వరూపం। భజదత్తం॥
మంత్రార్ణరూపం। మంత్రార్థ గోపం। మంత్ర ప్రతీపం। భజదత్తం॥
ద్రాంబీజ వాసం। దారిద్ర్యనాశం। దయానిధీశం। భజదత్తం॥
షడక్షరేశం। సంపత్ప్రకాశం। యోగోపదేశం। భజదత్తం॥
అష్టార్ణవేద్యం। భవరోగ వైద్యం। ఆనందహృద్యం। భజదత్తం॥
ద్వాదశ వర్ణం। ఆనంద పూర్ణం। యోగోర్త్తీర్ణం। భజదత్తం॥
షోడశ బీజం। గురు రాజరాజం। కైవల్య భాజం। భజదత్తం॥
దత్తాత్రేయం। కృష్ణం హరితం। త్రిమూర్తి రూపం। భజదత్తం॥
అనందదాయక। మునిబాల పుత్రం। షట్పాణి వరదం। భజదత్తం॥
విశుద్ధ జ్ఞాన। సాగరమీశం। సచ్చిదానందం। భజదత్తం॥

వంతేతి రమ్యం ॥



# శ్రీ దత్త స్తవము

1. దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలం
ప్రపన్నార్తి హరం వందే స్మర్తృగామీ సనోవతు॥

2. దీన బంధుం కృపా సింధుం సర్వకారణ కారణం
సర్వ రక్షా కరం వందే స్మర్తృగామీ సనోవతు॥

3. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం
నారాయణం విభుం వందే స్మర్తృగామీ సనోవతు॥

4. సర్వానర్థ హరందేవం సర్వమంగళ మంగళం
సర్వక్లేశ హరం వందే స్మర్తృగామీ సనోవతు॥

5. బ్రహ్మణ్యం ధర్మ తత్త్వజ్ఞం భక్త కీర్తి వివర్ధనం
భక్తాభీష్ట ప్రదం వందే స్మర్తృగామీ సనోవతు॥

6. శోషణం పాప పఙ్కస్య దీపనం జ్ఞాన తేజసః
తాప ప్రశమనం వందే స్మర్తృగామీ సనోవతు॥

7. సర్వరోగ ప్రశమనం సర్వ పీడా నివారణం
విపదుద్ధరణం వందే స్మర్తృగామీ సనోవతు॥

8. జన్మ సంసార బంధఘ్నం స్వరూపానంద దాయకం
నిశ్శ్రేయస పదం వందే స్మర్తృగామీ సనోవతు॥

9. జయ లాభ యశః కామ దాతుర్దత్తస్య యస్తవం
భోగ మోక్షప్రద స్యేమం ప్రపఠేత్ సకృతీ భవేత్॥